క్లుప్తంగా

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

అమ్రాబాద్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో అపరిశుభ్రత ఉండకూడదని, వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రామ్మోహన్ సూచించారు. మండలంలోని జంగంరెడ్డిపల్లిలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు, సెగ్రిగేషన్‌షెడ్, నర్సరీ తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మురుగు వీధుల వెంట పారకుండా ఇంకుడు గుంతలు తీసుకోవాలన్నారు. గ్రామంలో పరిశీలించిన ప్రతి పని, సమస్యలను ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తామన్నారు. సర్పంచ్ దాసరి లక్ష్మమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ విడుదల

కొల్లాపూర్: పట్టణంలో ఈ నెల 21న నిర్వహించే మాలమాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జానపద కళాకారుల సంక్షేమం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాముమాదిగ మాట్లాడారు. ఎస్సీ జాబితాలోని 59 కులాలకు చెందిన వారిని ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆత్మీయ సమ్మేళనానికి ఎస్సీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. మోహన్, కలమంద శేకర్, అరవింద్, పుట్టపాగరాము, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

కొల్లాపూర్: యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఐఆర్ఎస్ అధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. కొల్లాపూర్‌లో సమృద్ధి భారతి రాష్ట్రీయ ట్రస్ట్, కేవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలిసెట్ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. శిబిరాన్ని ఉదయ్‌కుమార్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యేల్లేని సుధాకర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని విద్యార్థులు, యువతకు మేలు చేయాలనే సంకల్పంతో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. శేఖర్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, భీమేష్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం

వెల్దండ: రాష్ట్రంలో నిరుద్యోగ యువత జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం ఆడుకుంటూ మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండలో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో యువతకు, విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించే నిరుద్యోగ నిరసన సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ హాజరవుతున్నట్లు తెలియజేశారు. మధుసూదన్‌రెడ్డి, శేఖర్, పుల్లయ్య ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



తాడూరు: క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని, క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిపూర్‌లో నిర్వహిస్తున్న ఖోఖో క్రీడా వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో నిర్వహించే ఉచిత ఖోఖో క్రీడా శిక్షణలో విద్యార్థులందరూ పాల్గొని క్రీడల్లో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. కోచ్ కురుమయ్య, మాసయ్య పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి

తాడూరు: రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సింగిల్ విండో అధ్యక్షుడు ఎం డి సమ్మద్‌పాషా, సీఈఓ ఆంజనేయులు కోరారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. మండలంలో 17 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 10 వేల బస్తాల వరిధాన్యం కొనుగోలు చేశామన్నారు. అదేవిధంగా మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1962 వంతున కొనుగోలు చేస్తున్నామన్నారు.

బీజేపీకో హటావో దేశ్‌కో బచావో

పెద్దకొత్తపల్లి: సీపీఐ ఇంటింటికి కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బాల్‌నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో వివిధ రంగాల్లో కొనసాగుతున్న అన్యాయాలను ప్రజలకు తెలియజేయడానికి ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని అన్నారు. నర్సింహ, ఫయాజ్, ఏసయ్య, లక్ష్మీపతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



శిర్సవాడలో విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు



శిర్సవాడలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాడూరు: మండలంలోని శిర్సవాడలో లక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా శక్రవారం రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవి పారాయణం, శకటోత్సవం వంటి కార్యక్రమాలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామస్తులు మేళతాళాలతో పాటు వేదమంత్రాల నడుమ ఆలయంలోకి తీసుకొచ్చారు. శనివారం ముగింపు కార్యక్రమాలు కొనసాగుతాయని సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, పూజారి జగదీశ్వరాచారి తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణం

వంగూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన లక్ష్మీనారసింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు పండితుల వేదమంత్రాల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో వంగూరు గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 6.30 గంటలకు గరుఢోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆరో తేదీ తెల్లవారుజామున రథోత్సవ కార్యక్రమం ఉంటుందని ఆలయ ధర్మకర్త రాజన్నస్వామి పేర్కొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌లోని స్వయంభు లక్ష్మీనారసింహస్వామి బహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారికి పూర్ణము, హోమం, పుష్పయాగం, దీపోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి ఉత్సవాలను ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ నెల 6న ఉదయం 6 గంటలకు లక్ష్మీనారసింహస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

బిజినేపల్లి: మండలంలోని వట్టెం లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, తెలంగాణ డెంటల్ అసోషియేషన్ ప్రెసిడెంట్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై పూజలో పాల్గొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో గ్రామస్తులంతా కలిసికట్టుగా భారీ తాడు సాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వారి బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు.



బైరాపూర్‌లో పూరోహితులు పూజలు



వంగూరులో నర్సింహస్వామి కల్యాణం

బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠాపన



వీరబ్రహ్మేంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెంట్లవెల్లి: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం గ్రామంలోని ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథులుగా పీఠాధితులు ఈశ్వరాదేవి మఠాధిపతులు వీరకుమారస్వామి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం మంత్ర పుష్పం, హోమం, మంగళహారతి, గణపతిపూజా, పుణ్యావచనం వంటి కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా వచ్చిన భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని పెంట్లవెల్లి ఎంపీటీసీ సుమలత శేషేంద్ర ప్రసాద్ నిర్వహించారు.

హాజరైన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి..

ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం కమిటీ పెద్దలతో మాట్లాడి చర్చించారు. అంతే కాకుండా ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఆలయ కాంపౌండ్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం పీఠాధిపతులతో ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుదర్శనాచారి, సత్యనారాయణ, శ్రీనివాసులు, శివశంకర్, శేషేంద్రప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యతండాలో..

ఉప్పునుంతల: మండలంలోని సూర్యతండాలో గిరిజనుల ఆరాధ్యదైవమైన తుల్జాభవాని నూతన ఆలయ నిర్మాణంలో శుక్రవారం తుల్జా భవాని విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు ముందుగా హోమాలు నిర్వహించి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం తీర్థ ప్రసాద వితరణలు జరిపారు. సర్పంచ్ బాలునాయక్, శంకర్‌నాయక్, హన్మంతునాయక్, తులసిరాం పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పిండి గిర్నిని ప్రారంభించిన లక్ష్మీనారాయణ

తెలకపల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అడిషనల్ డీఆర్‌డీఏ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నముద్దునూరులో జ్యోతి మహిళా సంఘంలోని స్త్రీలకు మిర్చి పిండి గిర్ని కేంద్రాన్ని ప్రారంభించారు. కార్పంగ గ్రామీణ వికాస్ బ్యాంక్ నుంచి మంజూరైన మిర్చి పిండి గిర్ని యూనిట్‌ను ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘం సభ్యురాలైన సుశీలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ మేనేజర్ పరమేశ్వర్, డీపీఎం వెంకటేష్, నిరంజన్, ఈరమ్మ, మల్లేష్, సీసీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటి కేసు నమోదు

బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లికి చెందిన ఐదుగురిపై గురువారం రాత్రి అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణ ఓబులరెడ్డి శుక్రవారం తెలియజేశారు. బుధవారం రాత్రి లట్టుపల్లిలో నిర్వహించిన ఊర్సు ఉత్సవంలో అదే గ్రామానికి చెందిన ప్రవీణ్(ఎస్సీ) యువకుడు మరికొంత మంది పాల్గొన్నారు. వారు ఉత్సవంలో ఉండగా.. గ్రామానికి చెందిన జంగం సుధీర్, కటికె మారుతి, జంగం పవన్, పిట్టల నరసింహ, మహేష్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఘనంగా బుద్ధ జయంతి



కొల్లాపూర్ జయంతి వేడుకల్లో నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం ప్రజావికాస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు కలమంద శేకర్ ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలమంద శేకర్‌తో పాటు తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాముమాదిగ మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు ఆది గురువైన బుద్ధుని బోధనలు అనుసరించాలన్నారు. శాంతియుత సమాజ స్థాపనకు పాటుపడాలన్నారు. నాయకులు కలమూరి రాములు, పుట్టపాగ రాము, అర్జున్, శ్రీను, కురుమయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రపంచ ధార్మిక బోధకుడు, మానవతా ప్రబోధకుడు గౌతమ బుద్ధుడి జయంతిని అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ మరియు బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మల్లికార్జున్, ప్రిన్సిపాల్ శోభన్, బాలస్వామి, వహీద్‌ఖాన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాములన్న, బాలస్వామి, గోవర్ధన్, వెంకటస్వామి, చెన్నయ్య, నర్సింహ, సాయిబాబు, శేఖర్, సింగోటి, శేషగిరి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ దాడులు

బల్మూర్: మండలంలోని నర్సాయపల్లిలో శుక్రవారం సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు సిబ్బందితో కలిసి విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 24 లీటర్ల సారాతో పాటు 30 కిలోల బెల్లం, 20 కిలోల స్పటిక స్వాధీనం చేసుకుని, 520 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి నిందితుడు రాజు పరారీలో ఉన్నాడని, అతనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో సిబ్బంది ఆంజనేయులు, ఉష, స్వాతి, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నట్లు చెప్పారు.

బాధితులకు పరామర్శ

కల్వకుర్తి రూరల్: మండలంలోని కురుమిద్దె గ్రామ పంచాయతీకి చెందిన వెంకటయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందాడు. శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి గ్రామానికి వెళ్లి వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన పర్వతాలు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన్ను పరామర్శించడంతో పాటు రూ.2 వేల ఆర్థిక సాయం అందజేశారు. వెంకటయ్య కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన రూ.3 వేలను భాస్కర్ అందజేశారు.

నైపుణ్య విద్యనందించడమే సీఎల్‌ఆర్ లక్ష్యం



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

తెలకపల్లి: నైపుణ్య విద్యను అందించడమే సీఎల్‌ఆర్ విద్యా సంస్థల లక్ష్యమని సీఎల్‌ఆర్ విద్యా సంస్థల అధ్యక్షుడు చీమర్ల శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ విద్యాసంస్థల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణలో ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 35 సంవత్సరాలుగా సీఎల్‌ఆర్ విద్యాసంస్థ ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిందన్నారు. ఈ కళాశాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఎంతో మంది వివిధ స్థాయిలో స్థిరపడ్డారన్నారు. సీఎల్‌ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి, సందీప్‌కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడలు

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా వివిధ జట్లు హోరాహోరీగా పోటీపడుతున్నాయి. మంచి ప్రతిభను కనబరిచిన క్రీడాకారుడికి మార్కెట్ మాజీ చైర్మన్ బాలయ్య మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందజేశారు. శ్రీనివాసులు, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.



ఆశవర్కర్లకు పరీక్షల ఆలోచన విరమించుకోవాలి

తాడూరు: ప్రభుత్వం ఆశవర్కర్లకు పరీక్షలు నిర్వహించి అందులో అర్హత సాధించిన వారినే కొనసాగించి మిగతావారిని తీసివేయాలనే ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి అశోక్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ కార్యాలయం వైద్యాధికారి డా.సంతోష్‌అభిరాంకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారుల వేధింపులు ఆపాలని, పనిభారం తగ్గించాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు సుజాత, పుష్ప, అరుణ, జ్యోతి, లక్ష్మి, భాగ్యమ్మ, శివలీల తదితరులు పాల్గొన్నారు.

సాగులో మార్పులు లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ సురేష్‌రెడ్డి

లింగాల: మారుతున్న వాతావరణ పరిస్థితులు లేదా ఇతర కారణాలతో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని ఏఈఓ సురేష్‌రెడ్డి చెంచు రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పాయపల్లిలో ఐటీడీఏ మన్ననూర్, మండల వ్యవసాయ శాఖ సంయుక్తంగా 'ప్రకృతి వ్యవసాయం'పై చెంచు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో చెంచు రైతులతో సమావేశం నిర్వహించి ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలి, లాభాలు ఏ రకంగా ఉంటాయనే దానిపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులతో కాకుండా ప్రకృతి వనరులతో తయారు చేసిన కాషాయం, వానపాముల ఎరువులు తదితర వాటిని వాడి పంటలను పండించడాన్నే ప్రకృతి సాగు అంటారన్నారు. ఈ పద్ధతిలో సాగు చేసే రైతులు ముందుకు వస్తే ఐటీడీఏ ఆధ్వర్యంలో చేయూత ఇస్తామన్నారు. ఈ విధానంలో పంటలను సాగు చేయడం అలవర్చుకోవడం చాలా మంచిదని సూచించారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు మండలంలోని అప్పాయపల్లి, అవుసలికుంట, ఎర్రపెంట, శాయిన్‌పేట, శ్రీరంగాపూర్ గ్రామాల్లోని 158 మంది చెంచు రైతులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో చైల్డ్ కేర్ ఆర్గనైజేషన్ ఐసీఆర్పీలు బిచ్చిరాజు, కుర్మయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీరామ్

కోడేరు: మండలంలోని రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ రైతులను కోరారు. శుక్రవారం మండల కేంద్రం కోడేరులో రైతు పంట పొలాలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలపై అవగాహన కల్పించి మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకోవడంతో భూమిలో రైతు పండించే పొల్లాలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఎంత మోతాదు ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. రైతులు అధిక దిగుబడి ఆశించి, విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడటంతో పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. ప్రతిఒక్క రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మధుసూదన్ రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



కల్వకుర్తిలో మాట్లాడుతున్న రాజేష్‌రెడ్డి



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న పర్వతాలు

నాగర్‌కర్నూల్‌రూరల్: సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు జిల్లా కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న సమ్మె శిబిరం వద్దకు వెళ్లి వారికి మద్దతు తెలిపారు.

కల్వకుర్తి రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి తోటపల్లి మాజీ సర్పంచ్ రాజేశ్‌రెడ్డి శుక్రవారం పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు సంఘీభావం తెలియజేశారు.

తెలకపల్లి: గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, సీపీఎం జిల్లా నాయకుడు గోపస్ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం తెలకపల్లిలో గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవదిక సమ్మె 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 8 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేవీ భాస్కర్, అనిత, కృష్ణవేణి, సరిత, ఫర్జానా, లక్ష్మీ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



ఎమ్మెల్యేకు వినతి అందజేస్తున్న వీఓఏలు



లింగాలలో మాట్లాడుతున్న యేసేపు

కొల్లాపూర్: తమ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి వీఓఏలు వినతి అందజేశారు. వీఓఏలు 19వ రోజు సమ్మె కొనసాగించారు. శిబిరం నుంచి ర్యాలీగా ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి, ఎమ్మెల్యేకు వివరించారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని అలవెన్స్‌లు కల్పించాలని కోరారు. వీఓఏల సంఘం నాయకులు పానుగంటి నరసింహ, అలివేల, మాధవి, సువర్ణ తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: వీఓఏలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు చేపట్టిన నిరవదిక సమ్మె శుక్రవారానికి 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మద్దతిస్తూ మాట్లాడారు. 19 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండి వైఖరి ప్రదర్శిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వారితో చర్చించి సమ్మె విరమింపజేయాలన్నారు. నెలకు రూ.26 వేల వేతనం, అర్హులైన వారికి సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, అదే విధంగా కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు గోపస్ లక్ష్మణ్, విజయ్‌గౌడ్, నాగలక్ష్మి, సుధా, మల్లేష్, అరుంధతి, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: కొన్ని రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఐకేపీ వీఓఏలు చేస్తున్న ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బీసమొల్ల యేసేపు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీఓఏల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

రిజర్వాయర్ అనుమతులు అవాస్తవం



మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్: ఉమామహేశ్వర, చెన్నకేశవ రిజర్వాయర్‌కు ప్రభుత్వం నుంచి రూ.1,534 కోట్ల నిధులు మంజూరు కావడంతో పాటూ నిర్మాణం అనుమతులు వచ్చినట్లు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చెప్పే మాటలు అవాస్తవమని డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆరోపించారు. శుక్రవారం అమ్రాబాద్ ఎంపీపీ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గం అభివృద్ధికి రూ.2,500 కోట్లు ప్రత్యేక నిధులు తీసుకొచ్చానని అచ్చంపేట ప్రజలను మభ్యపెట్టి బలవంతంగా సన్మానాలు, పూలు చల్లించుకుంది ఎంత వాస్తవమో ఇది కూడా అంతేనని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో వచ్చిన బంగారు తెలంగాణ బాబులు మరో సారి మోసం చేసి గద్దెనెక్కేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు వెంకటరమణ, వెంకటయ్య, రేణయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ: 2.52 కోట్లు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీరాం

మన్ననూర్: స్థానిక గ్రామపంచాయితీ పరిధిలోని వివిధ కాలనీల్లో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ చొరవతో సీఎం నిధుల ద్వారా రూ.2.52 కోట్ల మంజూరు చేశారని సర్పంచ్ నేనావత్ శ్రీరాం తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయం నుంచి శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి వరకు సీసీ రోడ్డును ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో గ్రామంలో మరిన్ని సీసీ రోడ్లు, మసీద్, దేవాలయాలు, బస్టాండ్ పనులు చేపడుతామన్నారు. ఇది ఇలా ఉండగా.. గ్రామంలో ఇప్పటికే గ్రామపంచాయతీ, ఎమ్మెల్యే నిధులు, 14 ఫైనాన్స్ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రవీందర్‌రెడ్డి, ఫహీముల్లా, మహేందర్‌గౌడ్, నిరంజన్, జహీర్, మల్లయ్య, బాలస్వామి, పుల్లయ్య, గోపాల్‌రెడ్డి, ఇదాయత్, సాజన్, రవి, మల్లేష్ పాల్గొన్నారు.

'పేదల పక్షాన పోరాడేది ఎర్ర జెండానే'



నాగర్‌కర్నూల్ రూరల్: పేదల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్ర జెండానే అని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ అన్నారు. శుక్రవారం మంతటిలో సీపీఎం జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడాలని, అణగారిన వర్గాలకు అండగా నిలవాలని అన్నారు. కె శ్రీనివాస్, బాలరాజు, సందీప్, దశరథం పాల్గొన్నారు.